## దారి తప్పుతున్న యువత




2





2

## ఘనంగా మార్కండేయ జయంతి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


హెల్మెట్ ధరించి..
బైకుపై ప్రయాణించి..



ప్రభుత్వం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంత్రి సీతక్క భీమ్‌గల్‌లో హెల్మెట్ ధరించి బైకు ర్యాలీలో పాల్గొన్నారు. –అక్షరటుడే, భీమ్‌గల్



## జీపీవోల సమస్యలను పరిష్కరించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జీపీవోల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీవీల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని వారి పక్క మండలాల్లో అవకాశం ఇవ్వాలన్నారు. జీపీవోలకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, ప్రొహిబిషన్ పూర్తయిన వారికి పదోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేశ పాండే రవి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పృథ్వీ, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు రవి, మూడు డివిజన్ల, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జీపీవోలు పాల్గొన్నారు.

## ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో రామగుండం పురపాలక సంఘంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావును కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న శ్రావణి రెండు రోజుల క్రితం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 45 రోజుల శిక్షణకు వెళ్లిన విషయం తెలిసిందే.




# రిజర్వేషన్ల రగడ

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో త్వరలో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. అయితే నిజామాబాద్ కార్పొరేషన్‌లో రిజర్వేషన్ల కేటాయింపు వివాదాస్పదంగా మారింది. వార్డుల వారీగా విడుదల చేసిన రిజర్వేషన్లపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మూడు డివిజన్‌లలో రిజర్వేషన్లు సరిగా లేవంటూ హైకోర్టును ఆశ్రయించారు.

- అక్షరటుడే, ఇందూరు

- నిజామాబాద్‌లో జనాభా ప్రతిపాదికన జరగలేదని ఆరోపణ
- మూడు డివిజన్లపై హైకోర్టులో పిటిషన్
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్న న్యాయస్థానం

నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఇటీవల కలెక్టర్ సంబంధిత అధికారులతో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతో పాటు నగరపాలక సంస్థకు చెందిన రిజర్వేషన్ ప్రక్రియ నిర్వహించారు. మహిళ రిజర్వేషన్ డ్రా పద్ధతిలో కేటాయించారు. అయితే నిజామాబాద్ నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో రిజర్వేషన్లు తారుమారయ్యాయి. దీంతో పలువురు ఆశావహుల ఆశలు గల్లంతయ్యాయి. అలాగే కొన్ని డివిజన్‌లలో ఉన్న జనాభాకు అనుగుణంగా శాస్త్రీయంగా రిజర్వేషన్లు కేటాయించలేదంటూ పలు పార్టీల నాయకులు ఆరోపించారు. మంగళవారం నిజామాబాద్‌కు చెందిన బీజేపీ నాయకుడు పోతన్కర్ లక్ష్మీనారాయణ నిజామాబాద్‌లోని మూడు డివిజన్లలో కేటాయించిన రిజర్వేషన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

### పునఃపరిశీలన చేయాలి

నగర పాలక సంస్థలోని 39, 40, 44 డివిజన్లను ఎస్సీలకు రిజర్వు చేశారు. అయితే సంబంధిత డివిజన్‌లో ఎస్సీ జనాభా ఓటర్లను క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించలేదని ప్రస్తావిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 13న తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 14 మార్గదర్శకాలకు విరుద్ధంగా రిజర్వేషన్లను కేటాయించారని, వాటిని పునః పరిశీలన చేయాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు మూడు రోజుల్లో పున: పరిశీలన చేసి తగు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. తుది తీర్పు వచ్చేవరకు ఎన్నికలపై స్టే విధించింది.

### ఆశావహుల్లో చర్చ

ఇప్పటికే తమ పార్టీ నాయకులు తమ డివిజన్‌లలో సీటు ఖరారు చేస్తారో లేదోనని ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అయితే హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో వారితో పాటు నగరవాసుల్లో చర్చ మొదలైంది. ఎన్నికలు జరుగుతాయో లేదో.. వాయిదా పడతాయా అంటూ చర్చించుకుంటున్నారు. మరోవైపు పిటిషన్ వేయడం సమంజసమేనని.. పలు డివిజన్లలో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కేటాయించలేదంటూ మరికొందరు వాదిస్తున్నారు.



## పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బుధవారం పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో నిజామాబాద్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. కళాశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం



**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలున్నాయన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 49 వార్డులు, బిచ్కుంద మున్సిపల్ పరిధిలో 12 వార్డులు, బాన్సువాడ మున్సిపల్ పరిధిలో 19 వార్డులు, ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 12 వార్డులలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ బల్దియాపై బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం



**అక్షరటుడే, ఆర్మూర్ :** మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి ఆర్మూర్ మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం పురపాలక ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి మెజారిటీ స్థానాలు కైవసం చేసుకునేలాగా కృషి చేయాలని సురేష్ రెడ్డి అన్నారు. ఆయా వార్డుల అభివృద్ధికి రాజ్యసభ నిధుల నుంచి కాలనీల అభివృద్ధికి తనవంతుగా నిధులను కేటాయిస్తానన్నారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు షకీల్, బిగాల గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పూజ నరేందర్, పోల సుధాకర్, సుంకరి రవి, గంగాధర్, నచ్చు చిన్నారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో తట్టెడు మట్టి కూడా తీయలేదు: గంప

**అక్షరటుడే, కామారెడ్డి :** అధికార పార్టీలో సలహాదారుగా కొనసాగుతున్న షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి రెండేళ్ల కాలంలో కామారెడ్డిలో తట్టెడు మట్టి కూడా తీయలేదని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విమర్శించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ శివారులో బుధవారం బృందావన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో సంక్షేమ ఫలాలు అందాయని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఝూటా హామీలిచ్చారని, ఓట్లు వేయించుకుని గద్దెమీద కూర్చున్నారని విమర్శించారు. కామారెడ్డిలో గెలిచిన ఎమ్మెల్యే రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తానని గొప్పలు చెప్పారని, పుస్తకం కూడా ప్రింట్ చేసి పంచారని, రూ.150 కోట్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. ఐదేళ్లలో రెండేళ్లు పోయిందని, చిల్లిగవ్వ పని అయిందా అని మాజీ ఎమ్మెల్యే నిలదీశారు. అధికార పార్టీలో ఉన్న షబ్బీర్ అలీ ఎమ్మెల్యే కాదని, ఎమ్మెల్సీ కూడా కాదని, ఎమ్మెల్యే కాని ఎమ్మెల్యేగా బుగ్గ కారులో ఎస్కార్ట్ వేసుకుని తిరుగుతున్నారని గంప విమర్శించారు. షబ్బీర్ అలీకి రెండేళ్లలో కామారెడ్డి గుర్తుకు రాలేదని, మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయని పోలీసులను వెంటేసుకుని సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు కొబ్బరికాయలు కొడుతున్నారని తెలిపారు. సీఎం పక్క ఆఫీసులోనే ఉన్న ఆయన కామారెడ్డికి ఏం చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల మాదిరిగా కాదని, ప్రతి ఓటు ముఖ్యమేనని, ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని కలవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.







## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి: ఎమ్మెల్యే

**అక్షరటుడే, బోధన్:** బైక్‌పై వెళ్లే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎడపల్లి మండలం దూపల్లి గేట్ వద్ద 'అరైవ్ అలైవ్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డుపై విద్యార్థులతో కలిసి వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్లపై వెళ్లే వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారులు రోడ్డు భద్రత ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బైక్‌పై హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులకు హెల్మెట్‌లు అందజేశారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎస్సై రమ విద్యార్థులు పాల్గొన్నారు.

## దమ్ముంటే అవినీతిపై బహిరంగ చర్చకు రావాలి: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కేటీఆర్, హరీష్ రావుకు దమ్ముంటే అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్, హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై బట్ట కాల్చి మీదవేసే ప్రయత్నం చేస్తున్నారని పీసీసీ చీఫ్ ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలపై చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. పసలేని ఆరోపణలు చేసి పారిపోతామంటే కుదరదన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తులు జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారంలోకి వచ్చాక సింగరేణితో పాటు అనేక సంస్థలను ప్రక్షాళన చేసి సంస్థ బలోపేతం కోసం మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు గత పదేళ్ల కాలంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సింగరేణిలో జరిగిన కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయంలోనే జరిగాయని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు ఎలా పెంచారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసే ప్రతీ ఆరోపణలకు తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.




## బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధి: మంత్రి సీతక్క

**అక్షరటుడే, ఆర్మూర్ :** రానున్న గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని పుష్కర ఘాట్లను అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర గిరిజన శాఖ సంక్షేమ మంత్రి సీతక్క తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడారం జాతరకు సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించి అన్ని వసతులు కల్పించారన్నారు. రానున్న పుష్కరాలకు సైతం సమ్మక్క సారక్క జాతకు కేటాయించినట్లుగానే నిధులు కేటాయించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని సీతక్క తెలిపారు. ఈ ప్రాంతంలోని దేవాలయాలను అభివృద్ధి పరుస్తామన్నారు. పట్టణ గ్రామాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. ఉపాధిహామీ పనులను తగ్గించకుండా 100 రోజులైనా పని కల్పించి నిధులను భరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోం మంత్రిత్వ శాఖను స్వయంగా తానే పర్యవేక్షిస్తూ యువత ఉన్నత లక్ష్యంగా అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనలు కల్పిస్తూ ముందుకు సాగతున్నామన్నారు. ప్రాణం ఉంటే అన్ని సాధించవచ్చునని, వేగం వద్దు ప్రాణం ముద్దని ఆమె పేర్కొన్నారు.



కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, యామాద్రి భాస్కర్, సంజయ్ సింగ్ బబ్లు, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## తపస్ క్యాలెండర్ల ఆవిష్కరణ




**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) పాల్వంచ మండల శాఖ ఆధ్వర్యంలో తపస్ క్యాలెండర్లను ఎంఈవో అన్నమనేని రామ్ మనోహర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యులు భాస్కర చారి క్యాలెండర్‌లో జాతీయ నాయకులు చిత్రాలు, జాతీయభావం ప్రతిబింబించేలా క్యాలెండర్లను రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల బాధ్యులు సిద్ధంశెట్టి పవన్ కుమార్, బంధువుల మల్లేశం, మల్లేష్, నాగేందర్, సుప్రియ పాల్గొన్నారు.

## మహిళలకు సంఘాల నిర్వహణపై శిక్షణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళలు మహిళా సంఘాల నిర్వహణపై మహిళలు బుధవారం అధికారులు శిక్షణ ఇచ్చారు. మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సంఘాల్లో నిధుల సమీకరణ, వినియోగం, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వారికి వివరించారు. ఈ మేరకు సెర్ప్ సీఆర్పీలు శోభారాణి, నాగశ్రీలు వారికి శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం రామ్ నారాయణ్ గౌడ్, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, సమాఖ్య అకౌంటెంట్ మహేష్, క్లస్టర్ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక శాస్త్రం ప్రతిభా పరీక్ష నిర్వహణ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కమ్మర్ పల్లి మానవ వనరుల విద్యాశాఖ భవనంలో సోషల్ ఫోరం నిజామాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంధ్రయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం సాయన్న, పీజీ హెచ్ఎం రాజన్న, సోషల్ పురం మండల అధ్యక్షుడు రమేష్ కన్వీనర్ అంబటి నర్సయ్య, తపస్ నాయకులు కిషన్ గౌడ్, రాకేశ్‌గౌడ్, గంగా ప్రసాద్ పాల్గొన్నారు.




# దారి తప్పుతున్న యువత

**జల్సాలకు అలవాటు పడిన యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలవైపు వెళ్తున్నారు. ముఠాలుగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. చివరికి పోలీసులకు చిక్కి జైలు పాలవుతున్నారు. ఫలితంగా విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. కామారెడ్డిలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు సంబంధించిన ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

- **జల్సాలకు అలవాటు పడి దోపిడీలు**
- **పోలీసులకు చిక్కి జైలు జీవితం గడుపుతున్న వైనం**
- **చోరీలపై పోలీసుల ఉక్కుపాదం**
- **అంతర్రాష్ట్ర షట్టర్ లిఫ్టింగ్ దొంగల అరెస్ట్**

కామారెడ్డి పట్టణంలో వరుస చోరీలు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోజుకొక ప్రాంతంలో చోరీలు జరుగుతూనే ఉండడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టి ముఠా సభ్యుల్లో ఇద్దరిని అరెస్ట్ చేయడంతో ముఠా గుట్టు రట్టయింది.

### జల్సాలకు అలవాటు పడి..

చోరీలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది యువతే ఉంటున్నారు. వీరిలో జల్సాలకు అలవాటు పడి చోరీల బాట పట్టిన వారే అధికంగా ఉంటున్నారు. కష్టపడకుండా డబ్బు సంపాదించే ఉద్దేశంతో తప్పుదారిని ఎంచుకుంటున్నారు. తద్వారా వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేస్తూ దారి తప్పుతున్నారు.

### పోలీసులకు చిక్కి..

చోరీలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఇందులో మైనర్లు కూడా ఉండడం గమనార్హం. బయట ప్రపంచం తెలుసుకునే వయసులో చోరీల దారిలో వెళ్తూ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసులకి చిక్కి జైలు జీవితం గడుపుతున్నారు. అంతేకాకుండా ఎక్కువ కేసుల్లో హస్తం ఉన్న వారిపై పోలీసులు పీడీ యాక్ట్ సైతం నమోదు చేస్తుండడంతో యువకుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. అయినా కొంతమందిలో మార్పు రాకపోవడంతో పాటు జైలు నుంచి వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు.

### ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

కామారెడ్డి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర చోరీల ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుస చోరీలకు చెక్ పెట్టేలా పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తూ ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. అనుమానాస్పద కదలికలు కనిపించిన వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారిస్తుండడంతో ముఠాల గుట్టు రట్టవుతోంది. ఇటీవల పోలీసులు పార్థీ గ్యాంగ్, గడ్డపార గ్యాంగ్, దారి దోపిడీ ముఠాలను పట్టుకుని వారిలో పలువురిపై పిడి యాక్టు నమోదు చేశారు.

### నిందితుల రిమాండ్

కామారెడ్డి పట్టణంలో నాలుగు దుకాణాల్లో షట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా చోరీలకు పాల్పడిన వారి వివరాలను సేకరించారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మైనర్లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరికొంత మంది ముఠా సభ్యులు ఉన్నట్టుగా గుర్తించిన పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

### పోలీసు నిఘా కొనసాగుతుంది



జిల్లాలో వరుస దొంగతనాల కట్టడికి పోలీసు శాఖ నిరంతరం పనిచేస్తోంది. పెట్రోలింగ్‌తో పాటు నాకా బందీ కూడా పెట్టి తనిఖీలు చేపడుతున్నాం. తమ కళ్లుకప్పి చోరీలకు పాల్పడే వాళ్లు తప్పించుకోలేరు. ప్రజలు కూడా మాకు సహకరించాలి. ప్రజలు ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలతో చోరీలకు పాల్పడే వారిని పట్టుకోవచ్చు. **– రాజేష్ చంద్ర, ఎస్పీ**

## గాంధారి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నిధులు

**అక్షరటుడే గాంధారి:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధి నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎమ్మెల్యే మదన్‌మోహన్ సహకారంతో మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులు, రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పనుల నిమిత్తం రూ.58 లక్షల మంజూరైనట్లు తెలిపారు.

## ఎక్లాస్‌పూర్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



**అక్షరటుడే, కోటగిరి:** మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆధ్వర్యంలో గుమ్మడి ఫౌండేషన్ (సారీష్ రాజ్ హోం) అనాథ ఆశ్రమంలో ఉచిత క్యాన్సర్ కంటి శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా అల్ట్రా సోనిక్, మెమోగ్రాఫ్, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన 300 మందికి మందులను అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడి ఫౌండేషన్ ఛైర్మన్ గుమ్మడి శ్రీధర్, సుచిత్ర, పబ్లిక్ హెల్త్ మేనేజర్, బిందు రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్, లక్ష్మణ్, డాక్టర్లు ప్రవలిక, సౌమ్య, జ్యోతి, అబ్దుల్, మాజీ జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఆశ్రమ నిర్వాహకులు మధుకర్, రాము, రంగబాబు, ఈర్వాంత రావు పటేల్, దుర్గాప్రసాద్, ఏఈ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జంగమ గురువులపై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం

**అక్షరటుడే, బోధన్ :** జంగమ సమాజ్ గురువులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని జంగమ లింగాయత్ సమాజ్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బోధన్ పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జుక్కల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జంగమ సమాజ్ గురువులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. స్వామీజీలు కులమతాలకు అతీతంగా భక్తులందరికీ ఒకే విధంగా ధర్మబోధ చేస్తారన్నారు. సమాజమంతటికీ మార్గదర్శకులుగా నిలిచే గురువులపై మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఎంబీసీ అధ్యక్షుడు పురాణే అజయ్ కుమార్, జిల్లా జంగమ సమాజ్ అధ్యక్షుడు గణాచారి శివకుమార్, బోధన్ పట్టణ ప్రతినిధులు నర్సింగ్ అప్పా, లక్ష్మణరావు పటేల్, పొదయ్య, రాజేందర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని కేజీబీవీ కళాశాలలో జరుగుతున్న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ తీరును డీఐఈవో షేక్ సలాం సందర్శించారు. ఈ సందర్భంగా మోడల్ అధికారి మాట్లాడుతూ జూనియర్ కళాశాలను సందర్శించి స్టడీ అవర్ నిర్వహణ తీరును పరిశీలించామన్నారు. అలాగే కళాశాల విద్యార్థులకు అందిస్తున్న విద్య గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తామని ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయన్నారు.

## బీసీలకు 50శాతం సీట్లను కేటాయించాలి



**అక్షరటుడే, ఇందూరు :** మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ పరంగా 50 శాతం సీట్లను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 32శాతం రిజర్వేషన్లు సరిపోవన్నారు. కాబట్టి జనరల్ స్థానాల్లో పార్టీ పరంగా 50 శాతం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీలత, చంద్రకాంత్, సాయి, బాలన్న పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి



గాంధారిలో..



ఎల్లారెడ్డిలో..

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మార్కండేయ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల్లో యజ్ఞాలు, కలశాల ఊరేగింపులు భజనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.** **- అక్షరటుడే, నెట్‌వర్క్**



ముప్కాల్‌లో..



ఆర్మూర్‌లో..

## వృద్ధుల సంక్షేమం కోసం 'డేకేర్ సెంటర్' ప్రారంభం



**అక్షరటుడే, ఇందూరు :** వయోవృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రణామం' పేరుతో కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో వృద్ధుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో వృద్ధుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ మానసిక ఆత్మస్థైర్యం పెంపొందించడం కోసం, గౌరవప్రదమైన జీవన విధానం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డేకేర్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కరిపే రవీందర్, అరుణ్ బాబు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

**అక్షరటుడే, బోధన్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు టౌన్ సీఐ వెంకట్ నారాయణ వివరాలు వెల్లడించారు. పట్టణంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎడపల్లి గ్రామానికి చెందిన రాజు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా.. రాజుకు వారం రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 9వ డివజన్‌లో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ 9వ డివిజన్ ఇన్‌ఛార్జి పత్తి శోభన్ స్వప్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు తొమ్మిది డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 9వ డివిజన్‌లోని సంతోష్ నగర్, వడ్డెర కాలనీ, నాగారం, చంద్రబాబు నాయుడు కాలనీల్లో టీయూఐఎఫ్‌డీసీ నిధులు రూ.1.50కోట్లతో 3 డ్రెయినేజీలు, 2 సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు లత, పుష్ప, రఘు, దిలీప్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'మాక్ పార్లమెంట్' నిర్వహించిన జడ్పీహెచ్ఎస్ అమ్దాపూర్ విద్యార్థులు




**అక్షరటుడే, బోధన్:** అమ్దాపూర్ గ్రామంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎంపీలుగా, మంత్రులుగా, ప్రభుత్వ, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులుగా వ్యహరించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సూర్య కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాలు ఏవిధంగా జరుగుతాయో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సైతం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, శ్రీకాంత్, పద్మ కళ్యాణి, అరుణ, సత్యనారాయణ, రాము, రమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.